

ఆబిడ్స్ అంతా మనుషులతో, కార్లు, బస్‌లు ఆటోలతో హడావిడిగా ఉంది. అది స్కూళ్ళకు ఆఫీసులకు పోయే సమయం అని కాబోలు బస్‌లన్నీ పిల్లలతో, కాలేజీలకు పోయే విద్యార్థులతో ఆఫీసులకు పోయే వ్యక్తులతో క్రిక్కిరిసి ఉన్నాయి. బషీర్‌బాగ్‌నుంచి శ్రీరాం కారును ఆబిడ్స్ గుండా పోనిచ్చాడు. కారు స్లో చేసి టాయిస్ ఎంపోరియం ముందు కారాపాడు కారు లాక్ చేసి చుట్టూ పరికిస్తూ లోపలికి పోయాడు. టాయిస్ ఎంపోరియంలో రకరకాల సైజుల్లోని బొమ్మలు ఆకర్షణీయమైన రంగుల్లో మెరుస్తూ పిల్లల్నే కాకుండా పెద్ద మనుషుల్ని ఆకట్టున్నాయి. శ్రీరాంను చూడగానే ఖరీదయిన మనిషని పసిగట్టిన షాపు యజమాని అతన్ని మర్యాదగా లోపలికి ఆహ్వానించాడు. చుట్టూ చూస్తున్న శ్రీరాం దృష్టి గోడలకున్న పెయింటింగ్‌లపై పడింది. అందులో ఒకటి ఏదో ప్రత్యేకత చూపిస్తోంది. సంధ్యా సమయంలో ఏటివడ్డున చెట్టు క్రింద బిందె పట్టుకొని సంధ్యారుణ కాంతులతో లీనమైన మేనిరంగున్న అందమైన యువతి కూర్చుని పరధ్యానంగా ఆలోచిస్తూంది. చెక్కిట చేయి చేర్చిన ఆ భంగిమ ఆలోచనా భారంతో సోలిపోయిన విశాలనయనాలు, తీర్చిదిద్దిన ఆ అవయవ సొంపు చాలా బాగున్నాయి. ఆమె అంతే. పరధ్యానంగా ఉన్నప్పుడు ఇలాగే ఉండేది. ఆమె కూడా పెయింటర్. మనుషుల బొమ్మల్ని గీయక పోయినా ప్రకృతి దృశ్యాలు ఆమె సన్నటి వేళ్ళ స్పర్శతో జీవకళను సంతరించుకునేవి.

"సార్! ఆ పెయింటింగ్ కావాలా?" తదేకంగా ఆ పెయింటింగ్‌ను చూస్తున్న శ్రీరాం అనాలోచితంగా తలూపి అడిగాడు "ఎంత?"

"దాని వెల నూట ఇరవై సార్."

శ్రీరాం మాట్లాడకపోవడం చూసి "అది నిర్మల్ పెయింటింగ్ సార్. అందుకే.. "

"పాక్‌చేయి" అంటూ జేబులోంచి

పర్స్ తీసి నూట ఇరవై లెక్కపెట్టి యిచ్చాడు. సాధారణంగా లాయర్ శ్రీరాం బేరమాడందే ఏ వస్తువూ కొనడు. అది అతని స్వభావం కాని ఈ రోజు అతనికి బేరమాడాలని లేదు త్వరగా దాన్ని తీసుకునిపోయి తన గదిలో తగిలించి దానికెదురుగా కూర్చుని తదేకంగా చూస్తూ ఆలోచించాలనిపించింది. షాపు వాడికి డబ్బిచ్చి బయటపడ్డాడు.

శ్రీరాం ఇల్లు చేరగానే "అంకుల్, అంకుల్" అంటూ పదేళ్ళ రఘు పరుగున వచ్చి శ్రీరాం చేతిలోని ప్యాకెట్ లాక్కుని పాకేజి తీసి చూశాడు. ఆ వెనకే వచ్చిన తులసి రఘు చేతిలోని పెయింటింగ్ చూసి తెల్లబోయింది.

"ఇదేమిటి అంకుల్ నేను ట్రైన్ తెమ్మంటే ఇవా తెచ్చారు." ఏడుపు మొహం వేశాడు రఘు సోఫాలో కూర్చున్న శ్రీరాం ఉలిక్కి పడ్డాడు

"అరె! అవును. నీకు ట్రైన్ తెస్తామని వెళ్ళాను ఆ సంగతే మరిచి పోయాను"

"రాం! ఈ వయసుకే నీకు మతి మరుపు ఎక్కువవుతోంది" తులసి మందలింపుగా అంది

"లేదక్కా! షాప్‌కు పోగానే ఈ పెయింటింగ్ చూశాను. వెంటనే కొనేసి చక్కావచ్చాను రఘు విషయమే మర్చి పోయాను" నవ్వేశాడు శ్రీరాం పెయింటింగ్ చేతిలోకి తీసుకొని ఏదో పోగొట్టుకున్న వాడిలా ఆతురతతో అతని చూపులు అందులోకి పరుగులిడాయి.

తులసి నిట్టూర్చి వెళ్ళిపోయింది.

"అంకుల్ ట్రైన్ కావాలి!" ఏడుపు మొదలెట్టాడు రఘు. ఆ రోజు రఘు పుట్టినరోజవడం మూలాన స్కూలుకు పోలేదు

"ఓ కె రఘూ. నను షాప్‌కు పోదాం నీకేదికావాలో అది తీసుకుందువు గాని నీవెళ్ళి కారులో కూర్చో నేను డబ్బు తెస్తాను" అంటూ మేడమీదికి వెళ్ళాడు శ్రీరాం రఘు ఏడుపు మరచి ఆనందంగా పరుగెత్తాడు.

బీరువాలోంచి డబ్బుతీసి జేబులో పెట్టుకొని యధాలాపంగా బీరువాకున్న అద్దంలోకి చూశాడు "ఈ వయసుకే నీకు మతిమరుపు ఎక్కువవుతోంది" అన్న తులసి మాటలు అతని చెవిలో ప్రతిధ్వనించినట్లనిపించింది చెవులదగ్గర ఒకటి రెండు వెండి వెంట్రుకలు మెరుస్తున్నాయి

"అక్కయ్య తన్నింకా బాలాకుమారుడనుకొంది కాని నలభై ఐదేళ్ళ వ్యక్తిగా గుర్తించదేం? తలమీద వెంట్రుకలు పలుచపడ్డాయి, మనిషి కాస్త లావయినా వంటిరంగేం మారలేదు అయినా అక్కయ్య కెపుడూ తను చిన్న పిల్లాడిలా కనిపిస్తాడు కాబోలు" నన్నటి చిరునవ్వు అతని పెదాలమీద మెరిసి మాయమయింది. త్వరగా క్రిందకు వచ్చికారు స్టార్ట్‌చేసి

యువ



ఆబిడ్స్ కేసి మళ్ళించాడు. ఐదు నిమిషాల్లో షాపింగ్ ముగించుకుని బయటపడి కారు వేగంగా నడపసాగాడు రఘుతో మాట్లాడుతూ పరధ్యానంగా ఉన్న శ్రీరాం సడన్‌గా బ్రేక్ వేశాడు కీచుమన్న శబ్దంతోపాటు ఒకమ్మాయి కెవ్వుమనడం విని త్వరగా కారు తలుపు తీసి దిగాడు. అది చిన్న సందు అవడంమూలాన మనుషులు అంతగా లేరు కారుక్రింద పడలేదు కాని కారు వేగం విసురుకు ప్రక్కగాపడి రాయి చేతికి గీచుకుపోవడంతో చర్మం లేచిపోయి మోచేయిమీద రక్తం కారుతోంది. ఐదేళ్ళ ఆ పాప భయంతో ఏడుస్తోంది. ఏమయిందో అని హడలిపోయిన అతని మనసు అంతగా దెబ్బ తగలని పాపను చూసి తేలికపడింది

"అరెరె! దెబ్బ తగిలిందా పాపా!" పెద్ద దెబ్బ తగలని పాపను ఎత్తుకొని కార్లో కూర్చోపెట్టి నలుగురూ రాకముందే ఇంటికి దారితీశాడు.

కారులో పాప ఏడవకుండా చాక్‌లెట్స్ కొనిపెట్టి వాళ్ళ ఫామిలీ డాక్టర్ దగ్గరికి తీసుకునిపోయి డ్రస్సింగ్ చేయించి ఇంటికి వచ్చాడు పాప ఏడుపు మానేసి చాక్‌లెట్స్ చేతిలో పట్టుకుని కొత్త వాతావరణాన్ని పరికిస్తోంది. జరిగినదంతా అక్కయ్యతో చెప్పి పాలు పళ్ళు స్వయంగా తీసుకు వచ్చి కూర్చున్నాడు శ్రీరాం.

చారడేసి కళ్ళతో భయంగా చూస్తున్న పాప శ్రీరాంను చూడగానే "ఇంటికి పోతా" అంది.

"పోదాం అవి తినమ్మా"

"ఉహూఁ! పరాయివాళ్ళు ఏమిచ్చినా

తీసుకోకూడదని బామ్మ చెప్పింది" ముద్దుగా చెబుతోన్న పాప మాటలకు శ్రీరాం నవ్వారు.

"నేను పరాయివాడిని కానమ్మా. అంకుల్‌ని కదా తిను" అంటూ నచ్చ చెప్పడంతో ఆ పాప ఆట్టే బెట్టు చేయకుండా స్వీట్స్ తిని పాలు తాగింది.

"నేను స్కూలుకు పోవాలి" భయంగా అంది పాప.

"ఏ స్కూలమ్మా?"

"రోజరీ కాన్వెంట్" ముద్దుగా చెప్పింది.

"ఇవాళ స్కూలుకు వెళ్ళద్దులే దెబ్బ తగిలిందికదూ! మా ఇంట్లో రఘు ఉన్నాడుగా ఆడుకో. సాయంత్రం మీ ఇంటికి తీసుకుపోతాను"

"ఉహూం! బామ్మ స్కూలుకుపోకుంటే కోప్పడుతుంది ఒకరోజు నేను స్కూలుకు పోనని ఏడిస్తే అమ్మ కొట్టింది. బామ్మ ఏమో బజారుకు తీసుకునిపోయి స్వీట్స్ కొనిచ్చి బొమ్మలిచ్చి మా స్కూల్లో వదిలి పెట్టింది."

పరవాలేదు. కల్చర్డ్ బామ్మ ఉంది పిల్లకు అనుకుని నవ్వుకున్నారు శ్రీరాం.

"మీ అమ్మ ఏమీ అనదా?"

"మమ్మీ ఉండదుగా ఆఫీసుకు పోతుంది."

"మీ బామ్మ ఏమీ అనదులే. నేను మీ ఇంటికి వచ్చి చెప్తాను. నీవు ఆడుకో పాపా!" అంటూ శ్రీరాం కోర్టుకు టైమ్ అవడంతో బయల్దేరారు.

శ్రీరాం ఇంటికి వచ్చేసరికి పాప నిద్రపోతోంది. అప్పటికి సాయంత్రం అవడంతో పాపను లేపారు. మరీ ఆలస్యం అయితే పాప అమ్మా, నాన్న గాభరా పడతారని త్వరగా పాపను తీసుకు వెళ్ళారు. దారిలో స్వీట్స్ కొనిచ్చారు. అతనికి మనసులో గాభరాగా ఉంది వాళ్ళేమంటారో అని. దాష్ అయిన చోట కారాపి పాపనడిగారు "మీ ఇల్లెక్కడ పాపా?" అని.

"అదిగో ఆ పచ్చమేడ పక్కన" సంతోషంగా చెప్పింది.

"థాంక్‌గాడ్! గుర్తుపట్టింది" అనుకుని శ్రీరాం ఆ ఇంటి బయట కారాపాడు. చుట్టూ వున్న పూలచెట్లలో మునిగిపోయింది. తోటమీద ఎంత ఆసక్తి!! అనుకున్నాడు

పాప వస్తువులతో దిగి లోపలికి పరుగెత్తింది "బామ్మా! "బామ్మా" అంటూ.

'భగవంతుడా జరిగింది విని ఆ ముసలావిడ ఎన్ని తిడ్తుందో?" అనుకున్నాడు

"లోపలికి రండి బాబూ! చిన్నమ్మగారి కోసం అమ్మగారు, బాబుగారు ఇస్కూలుకు పోయింద్రు" పనివాడొకడు వచ్చి చెప్పాడు. ఐదు నిముషాలనంతరం పాప ఎవర్నో లాక్కురావడంతో శ్రీరాం లేచి నిలబడ్డారు.

"బామ్మా! ఈయనే బామ్మా. నాకు మందువేయించి, వాళ్ళింటికి తీసుకెళ్ళారు"

పాప మాటలతో ఆమె అతనికేసి చూసింది. అతను నమస్కారం పెట్టి ఆగిపోయాడు. పీలిరంగు వాయిల్‌చీర ఆదేరంగు జాకెట్టు చెవులమీదుగా వదులుగా జారిన జుట్టు నిర్లిప్తంగా ఉన్న సోగకనులు నవ్వీనవ్వని పెదాలతో అతి సాధారణంగా ఉంది. అయినా ఆమెచుట్టూ ఆకర్షణ వుంది. ఆమెకూడా కళ్ళప్పగించింది.

"మీరా?" మొదటిమాట అతనే అనగలిగాడు అమక్షణం వూహల్లో మెదిలే వ్యక్తి ఒక్కసారి ప్రత్యేకమైతే అతను చేతగానివాడిలా నిలబడ్డాడు. ఆమె బొమ్మలా నిలబడింది. అంతలోనే తేరుకుని దగ్గరగా వచ్చి నెమ్మదిగా "కూర్చోండి" అంది శ్రీరాం మంత్రముగ్ధుడిలా కూర్చున్నాడు.

"పాప స్కూల్‌నుంచి రాకుంటే వాళ్ళ పేరెంట్స్ స్కూల్‌కు ఫోన్‌చేసారు. పాప స్కూలుకు రాలేదని తెలుసుకుని గాభరాగా కారేసుకుని వెళ్ళారు మీరిలా వచ్చారు ఇంతకీ ఏమయింది?" ఆమె అతి సామాన్యంగా అడుగుతోంది. శ్రీరాం వళ్ళు మండిపోయినట్టనిపించింది. ఇరవై సంవత్సరాలనంతరం కన్పిస్తే ఈమె ఇలాగేనా మాట్లాడేది? ఇప్పుడు పాప సంగతి ఎందుకూ? అన్పించినా నోరు విప్పాడు. జరిగింది టూకీగా చెప్పాడు.

"బామ్మా మరే వాళ్ళబాబు చాలా మంచివాడు మేము బాగా ఆడుకున్నాం." అని పాప మధ్యలో అడ్డొచ్చింది, బాబు పేరు వినగానే ఆమె మొహం ముడుచుకుపోయింది.

"ఈమేనా పాప బామ్మ!! అదిరిపోయాడు శ్రీరాం. ఆమె తలలో ఒక్క తెల్ల వెంట్రుకలేదు. మొహంలో ముడుతలు లేవు. ఇరవై ఏళ్ళ క్రితం తానారాధించిన సత్యలో ఏమార్పూ లేదు. తన ప్రేమలాగే ఆమె నిశ్చలంగా ఉంది. ఆమెకు నలభై ఏళ్ళంటే ఎవరూ నమ్మరు! కాని తను భరించలేనిది ఆమె బామ్మ కావడం. తనెవరికీ తాతకాలేదు. అసలు ఎవరికీ భర్తేకాలేదు, కాని తనముందే ఆమె మరొకరి సొత్తవుతుందని తనకెందుకు తట్టలేదు? తన మనసెందుకిలా జెలసీతో మండిపోతోంది. ఈమెనెందుకు తన మనసులోంచి చెరుపుకోలేకపోతున్నాడు? ఎంత నిర్లక్ష్యంగా వుంది. అవును భర్త గొప్పవాడేమో అందుకే మొహం ముడుచుకుని కూర్చుంది తనెప్పుడు పోతాడా అని. ఆ వూహ రాగానే శ్రీరాం చటుక్కున లేచినిలబడి "నేపోతాను" అన్నాడు.

ఆమె సన్నగా నవ్వింది "మీ శ్రీమతి కోప్పడుతుందా? జస్ట్ టెన్‌మినిట్ కూర్చొండి కాఫీ తెస్తాను" అంటూ లోపలికెళ్ళిపోయింది

శ్రీరాం దవడలు బిగుసుకున్నాయి. "సత్యా! నేను నీ అంత నమ్మకద్రోహిని కాను." అనుకుని కూర్చున్నాడు. ఆమె కాఫీ ఇవ్వగానే అందుకుంటూ "అనవస

రంగా శ్రమపడ్డారు'' అన్నాడు. ఆమె అతని కన్నుల్లోకి సూటిగాచూసి వూరుకుంది.

''చాలారోజులకి కన్పించారు'' శ్రీరాం కంఠం కొంచెం వణికింది.

''అసలు మిమ్మల్ని చూస్తాననుకోలేదు.''

శ్రీరాంమొహం ఎర్రబడింది. అవును తనెందుకు గుర్తుంటాడు? ఆమె తన సంసార సాగరంలో మునిగిఉంది ఇప్పటివరకూ ఆమెను మనసులో నిల్పుకుని ఆమె నిరీక్షణలో కాలం గడుపుకున్నాడని తెలిస్తే హేళనగా నవ్వుతుంది కాబోలు.

''కాఫీ తాగండి'' ఆమె గుర్తు చేసేసరికి వద్దనలేక శ్రీరాం తాగాడు. తెల్లటి మొహానికి వెడల్పాటి కుంకుమ వన్నె తెస్తోంది. ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. మెడలో మంగళసూత్రం గొలుసుకాబోలు తళుక్కు మంటోంది. అతని చూపులతో కలిసిన ఆమెచూపులు క్రిందకు వాలిపోయాయి. అదిగ్రహించిన శ్రీరాం సర్దుకున్నాడు.

''మీ అన్నయ్య వాళ్ళంతా ఎక్కడున్నారు?'' అని ప్రశ్నించాడు.

''అన్నయ్యవాళ్ళు రాజమండ్రి లో ఉన్నారు'' అని ఆమె ఇంకా అతనేమయినా ప్రశ్నిస్తాడేమో జవాబివ్వాలన్నట్లు శ్రీరాం మొహంలోకి చూస్తోంది.

''ఇంట్లో ఎవరూ లేనట్లుంది?'' అన్నాడు. మనసులో అడగాలనుకున్నది ఉండిపోయింది.

''ఉహూం! బయటికెళ్ళారంతా మీరుండేది ఎక్కడ?''

''ఇక్కడే సెటిల్ అయ్యాం. ఇదిగొండి నా అడ్రస్'' శ్రీరాం అడ్రస్ రాసిచ్చాడు ఆమె దాన్ని చూడకుండానే ప్రక్కకు పెట్టింది. అతను మనసులో ఉడుక్కున్నాడు. ఇంతలో పాపవచ్చింది. ''బామ్మా! మమ్మీ ఎప్పుడొస్తుంది?''

'కాసేపట్లో వస్తుంది. నీవెళ్ళి ఆడుకోమ్మా.'' అని బుజ్జగించింది.

''మీరు చాలా త్వరగా బామ్మయిపోయారే?''

శ్రీరాం ప్రశ్న ఆమెకు వెక్కిరింతగా తోచింది. "ఏం మీరింకా తాతకాలేదా?'' అని ఎదురు ప్రశ్నవేసింది. శ్రీరాం నవ్వాడు. ఆనవ్వులో ఏదో వెలితి కనబడుతోంది.

''ఆ అదృష్టం నాకు పట్టలేదు." శ్రీరాం ఉన్నట్టుండి లేచాడు.

''సరె నే వెళ్తాను."

''ఎప్పుడయినా మీ శ్రీమతిని తీసుకుని రండి'' ఆమె చాలా నెమ్మదిగా అడిగింది. శ్రీరాం పకపకానవ్వాడు. ''ఆ అదృష్టములేదు. ఆవిడకు ఘోషా.'' అంటూ బయటికి నడిచాడు. వెళ్తూ వెనుదిరిగి ఆమెకు నమస్కారంచేసి ''ఎప్పుడయినా మీ శ్రీవారితో మా గృహం పావనం చేయండి'' అంటూ వెళ్ళిపోయాడు.



శ్రీరాం అతని కారు వెళ్ళిపోయిన ఐదు నిముషాలవరకూ ఆమె కిటికీదగ్గరే నిల బడింది గాలి తీవ్రంగా వీస్తోంది. సత్యాదేవి రోడ్డుకేసి చూస్తోంది అది కంటికి కనిపించి నంతమేర చాలా పొడవుంది. తన జీవితంలాగే తన జీవిత గమ్యంలో తను మూడు వంతులభాగాన్ని అధిగ మించింది ఉన్న కాస్త కాలం తనకు విసుగు పుట్టిస్తోంది ఎందుకీ నిరీక్షణ? ఎవరికోసం? తన నిరీక్షణ ఎంత వ్యర్థ మైనదో తనకు తెలుసు కాని తన మనసును తానే వంచించుకుంది. శ్రీరాం తనకోసం వేచియున్నాడనే నమ్మకం లేకున్నా తన మనసు చంపుకోలేక పోయింది. తనకు తెల్సు ఏనాడో తన జీవితంలో శ్రీరాం తటస్థ పడతాడని తను ఒంటరిగా మిగిలిపోతుందని!! కాని తను అతనికోసం పిచ్చిదానిలా జీవితాన్ని మోడు చేసుకుంది ఈ సత్యం ఒకనాడు తను తెలుసుకుంటుందని బాధ పడ్తుందని ముందే తెలుసు. తెలిసీ మళ్ళీ ఎదలో ఏదోమూల జెలసీ ముల్లులా గుచ్చుతోంది. అతనికోసం నీ జీవితం పాడు చేసుకున్నావు. నీకోసం ఎవరూ ఏ త్యాగం చేయలేదు నీకెందుకీ తపన? అని మనసు గద్దిస్తుంటే కన్నీరు కార్చటం తప్ప తనేం చేయగలదు?

సత్యాదేవి కిటికీమూసి దాన్ని ఆను కుని కళ్లు మూసుకుంది ఆమె మనసులో ఏదో అలజడి మొదలయింది. తన

హృదయంలో ఎవరూ ఆక్రమించని స్థానాన్ని శ్రీరాం అధిష్టించాడు. అక్కడ్నించి అతన్ని తీసివేయలేక పోతోంది. ఇది తన బలహీనతా? అన్నయ్య స్నేహితుడిగా పరిచయం అయి జీవితంలో మరువలేని వ్యక్తి గా నిలచిపోయాడు. సత్యాదేవి ఆలోచిస్తూ పడుకొంది. ఆమె మెదడులో గతం గిర్రున తిరుగుతోంది.

సత్యాదేవి వాళ్ళ కుటుంబం మరీ సాంప్రదాయ కుటుంబం కాదు. అందరూ చదువుకునే వాళ్ళుండి కాబోలు ఆడపిల్లలకు కూడా స్వేచ్ఛా స్వాతంత్ర్యము ఉండేవి. సత్యకి చదువు ఇరవై ఏళ్ళు నిండలేదు. బి. ఏ ప్యాసయి ఇంట్లో కూర్చుని ఉండేది. ఉబుసుపోక పెయింటింగ్ నేర్చుకుని బొమ్మలు వేస్తూ వంటరితనాన్ని మరచిపోయేది. ఆరోజుల్లోనే శ్రీరాంతో పరిచయం కలిగిందామేకు. శ్రీరాం లా కాలేజిలో చదువుతుండేవాడు. సత్య అన్న చంద్రంకు క్లాస్‌మేట్ అవడంతో ప్రతి రోజూ సాయంత్రం హాస్టల్‌నుంచి సత్య వాళ్ళింటికి వచ్చేవాడు. చంద్రం అతను కలిపి ఒక్కోరోజు కార్డ్స్ ఆడేవారు లేదా షికారెళ్ళేవారు. శ్రీరాంకు సత్యను పరిచయం చేసాడొకరోజు చంద్రం.

ఒకరోజు మామూలుగా శ్రీరాం వచ్చే టైముకి చంద్రంలేడు. సత్యముందు గదిలో కూర్చునిపెయింట్ చేస్తోంది. వెనకనుంచి ఆమెను చూసిన శ్రీరాం గుమ్మంలోనే ఆగిపోయాడు. నైపుణ్యం కల శిల్పిచెక్కిన శిల్పంలాగుంది ఆమె గుమ్మం దగ్గర అలికిడి విన్న సత్య తల తిప్పి చూసింది. శ్రీరాం రెప్పవాల్చకుండా ఆమెనే చూస్తున్నాడు. జీవం పోసుకున్న పాలరాతి బొమ్మలా ఉంది సత్య

"అరె! అక్కడే నిలబడి ఉన్నారే. లోపలికి రండి" అంది బ్రష్‌ను పక్కకు పెడ్తూ.

"అక్కడ నిలబడి ఏమిటి దీక్షగా చూస్తున్నారు."

"చక్కటి శిల్పాన్ని!"

సత్య అందమైన పలువరస ఆమె నవ్వులో తళుక్కుమంది.

"ఇది పెయింటింగ్ శిల్పంకాదు!" తప్పు సరిదిద్దింది.

"కాదు! నే చూసేది బ్రహ్మచేసిన సజీవశిల్పాన్ని"

సత్య ఉలిక్కిపడి తలెత్తి కళ్ళు పెద్దవిచేసి చూసింది. అతన్ని అంత దగ్గరగా చూడ్డం ఆమెకు అదే ప్రథమం. తీక్షణంగా చూసే కళ్ళు. నవ్వినట్టుండే పెదాలు. చామనఛాయలో ఉన్నా అతనిలో చాలా ఆకర్షణ ఉంది.

"నిజం! ఈ వాళ మీరు చాలా అందంగా వున్నారు" శ్రీరాం మళ్ళీ చెప్పాడు. సత్య తలదించుకుంది. ఇంత ధైర్యంగా ఆమెనెవరూ ప్రశంసించలేదు. ఆమె మనసు ఏదో తెలీని అనుభూతికి లోనయింది. అంతలో సర్దుకుని చటుక్కున లేచి "ఉండండి! కాఫీ తెస్తాను"

అంటూ లోనికెళ్ళిపోయింది.

ఆమె తెచ్చిన కాఫీ నందుకుని ఆమె కళ్ళల్లోకి చూసాడు శ్రీరాం అతని చూపులకు చిక్కకుండా ఆమె కళ్ళు వాల్చుకుంది.

''చంద్రం ఎక్కడికిపోయాడు'' కాఫీ పూర్తిచేసి క్రిందపెట్టి యధాలాపంగా అడిగాడు శ్రీరాం.

''ఏమండి బయటికి వెళ్లాడు'' అంది పెయింటింగ్ చేతిలోకి తీసుకుని.

''మీరు చాలా బాగా పెయింట్ చేస్తారే?''

''ఏదో ఈమధ్యే నేర్చుకున్నాను'' ముక్తసరిగా జవాబిచ్చింది. ఆ తరువాత సత్య ఏమీ మాట్లాడకుండా పెయింట్ చేయడంలో మునిగిపోయింది. శ్రీరాం కాసేపుండి వెళ్ళిపోయాడు శ్రీరాం ఆ తరువాత వారం రోజులవరకూ రాలేదు.

సత్య మనసులోని ఆలోచనల్లో తరచూ శ్రీరాం వస్తున్నాడు. ఒకరోజు చంద్రం శ్రీరాంను లాక్కురావడం చూసి సత్య ఆశ్చర్యంగా లేచింది.

"చూసావా సత్యా. ఈ మధ్య వీడెంత సోమరవుతున్నాడో. మనింటికి రాక వారం అవుతోంది. ఎందుకని అడిగితే ఏవో సాకులు చెప్పి తప్పుకుంటున్నాడు" అంటూ చంద్రం ఫిర్యాదు చేసాడు.

శ్రీరాం తలదించుకున్నాడు. శ్రీరాంను పరీక్షగా చూస్తూ సత్య చిన్నగా నవ్వింది.

"సత్యా! నేను స్నానం చేసివస్తాకానీ నీవు వీడిని కనిపెట్టుకుని ఉండు. అజాగ్రత్తగా వుంటే పారిపోయేటట్లు ఉంది వీడి వాలకం" చంద్రం తమాషాగా నవ్వి లోపలికి పోయాడు. సత్య కాఫీ తెచ్చి శ్రీరాం కిచ్చింది. ఇద్దరి చూపులు క్షణం కలుసుకున్నాయి. శ్రీరాం చూపులు తిప్పుకున్నాడు.

"మీరెందుకు అన్నయ్యను తప్పించుకు తిరుగుతున్నారు. మీరు మా ఇంటికి రాకూడనంత నేరం మేమేం చేసాం?" సూటిగా వున్న సత్యప్రశ్న అతన్ని కలవర పెట్టినట్లు ఉంది.

"సత్యాదేవి పొరపడ్తున్నారు. నేను రాకపోవడానికి కారణం మీకు తెల్సు. ఆ రోజు మిమ్మల్ని మీ అందాన్ని అభినందించి మీకు బాధ కల్గించినట్లుతోచింది. అందుకే రావడం మానేసాను"

"అలాంటప్పుడు కష్టం కలిగించే పనులు చేయకండి" సత్య చిఱునవ్వుతో అంది. శ్రీరాం క్షణం ఆశ్చర్యంగా చూసాడు "ఉహూఁ! నావల్లకాదు. అందం ఎందులో ఉన్నా అభినందించడం నా పని ఇది నాకు తెలీకుండానే ఒక్కోసారి జరుగుతుంది" అతని మాటలకు సత్య కళ్ళుప్పగించింది అతని కళ్ళల్లో నైర్మల్యం తొణికిసలాడుతోంది తన భావన ఎంతసూటిగా చెప్తాడు? సత్య మనసులో ఏదో భావం మెదలగా ఆమె మొహం ఎర్రబడ్డది

"అయితే మేమేం చేయాలి?"

"నా బలహీనత అర్థం చేసుకుని క్షమిస్తుండాలి"

సత్య పకపకా నవ్వేసింది ఆమె కళ్ళల్లో మెరుపులు. ఆ పలువరసలో తళుకులు ఆమెలోని వన్నెలు చూస్తుండి పోయాడు శ్రీరాం.

"సరే! క్షమిస్తుంటాంకానీ మీరెప్పుడూ మా ఇంటికి రావడం మరచిపోకండి" అంది నవ్వాపుకుని. చంద్రం రావడంతో సత్య లోనికెళ్ళింది.

అప్పట్నుంచీ సత్యా. శ్రీరాం తరచూ మాట్లాడుకునేవాళ్ళు. అతనెప్పుడూ ఆమె చిత్రకళను ప్రశంశిస్తూ అవసరమైన సూచనలిస్తూ ఆమె కళను ప్రోత్సహించేవాడే తప్ప మరో అధికప్రసంగం చేసేవాడు కాదు సత్యకు రానురాను అతనంటె ఆసక్తి పెరిగింది. అతను రానిరోజు ఆమెకు తోచేది కాదు

అతడు గంటల తరబడి ఏ విషయం మీదయినాసరే చక్కగా మాట్లాడేవాడు. చంద్రంతో అతను చెప్పే ఖబుర్లన్నీ సత్యా వినేది.

సంవత్సరం గడిచేసరికి చంద్రం లా చదివి ఉద్యోగరీత్యా మెడ్రాస్ వెళ్ళి పోయాడు. అలవాటు ప్రకారం శ్రీరాం రోజూకాకున్నా వారానికొకమారయినా సత్యవాళ్ళింటికి వెళ్ళి పదినిముషా లుండి వెళ్ళిపోయేవాడు. పూర్వపు చనువుతో ఇంట్లోవాళ్ళు అతన్ని అభ్యంతర పెట్టేవాళ్ళు కారు. ఈ మధ్యకాలంలోనే సత్య ఆశలు మొగ్గలు వేయసాగాయి. శ్రీరాం ఆమె పెయింటింగ్స్ పరధ్యానంగా ఆమెను నిశితంగా చూసేవాడు. చురుగ్గా బాకు కంటె పదునుగా ఉండే అతని చూపులు ఆమెను ఇబ్బందిలో పడేసేవి. ఆమె అంతరంగంలో ఎక్కడో తీయని భావం చెదిలేది. ఇన్నాళ్లూ ఆమె ఎరిగిన అతని వ్యక్తిత్వం సత్య మనసులో నిలిచిపోయింది. "తనంటే అతనికి ఇష్టముందా? ఉంటే దాన్నెందుకు చెప్పడు? అతనికి మొహమాటం లేదే!" అని తనలో తాను తర్జన భర్జన పడేది.

శ్రీరాం సత్యవాళ్ళింటికి రావడం పూర్తిగా మానేసాడు. దానిక్కారణం సత్య వాళ్ళక్క పుట్టింటికి రావడం శ్రీరాంతో ఆమె ఒకరోజు మాట్లాడుతూ ప్రస్తుతం చంద్రం లేడుకదా, మరి నీవీ ఇంటికి ఇలా మాటి మాటికీ రావడం బాగులేదు" అనే అర్థం స్ఫురించేటట్లు డొంకదిరుగుడుగా మాట్లాడింది. అంతే శ్రీరాం రావడం మానేసాడు. ఈ సంగతి సత్యకు తెలీదు.

బి. ఎల్. ఫైనల్ ఎగ్జామ్స్ అయి పోయినా శ్రీరాం రాకపోవడంలో సత్య మనసెందుకో కలతబారింది. తనెన్నో వూహించుకుంది. అవన్నీ కల్లలేనా? తన మీద శ్రీరాంకు ఏ అభిప్రాయం లేకుంటే అతని చేష్టలకర్థం ఏమని చెప్పుకోవాలి? అతను రాకుంటే తను వూహించిందంతా పచ్చి అబద్ధం అనే సత్యాన్ని అనుకో డానికే భయపడింది సత్య మనసులోని భారం తగ్గించుకునేందుకు వూరిమధ్యన విశాలంగా వెలిసిన గుడికెళ్ళింది. కొబ్బరి కాయ కొట్టేసి బయటికివచ్చి నిలబడి పోయింది సత్య. ఆమెకెదురుగా మాసిన గడ్డంతో మసిగుడ్డలోని మాణిక్యంలా నిలబడ్డ శ్రీరాం పలకరింపుగా నవ్వాడు. సత్య ఆత్రంగా అతనిదగ్గరికి వచ్చింది.

"ఎగ్జామ్స్ ఎట్లా వ్రాసారు? మా ఇంటికి రాలేదేం?" నిష్ఠూరత ధ్వనిం చింది సత్య కంఠంలో. శ్రీరాం నవ్వాడు చిన్నగా "అలా తోటలోకి పోదాంరండి" అన్నాడు.

ఇద్దరూ కలిసి తోటలోకూర్చున్నారు. సత్య మనసులో ఉడికిపోతోంది.

"ఇప్పుడు పోట్లాట కానీయండి"

సత్య చురుగ్గా చూసింది కాని అతని వెన్నెలకురిసే నేత్రాలతో పోటీపడని

ఆమె చూపులు వాలిపోయాయి. "వోట్లాట వేసుకునే అవసరం ఏముంది. మీరు పెద్దవాళ్ళయి పోయారు. మీకు మేమెందుకు గుర్తుంటాము?"

"అదేంకాదు మీ అక్కయ్య నన్ను మీ ఇంటికి రావద్దన్నారు."

"ఇంతకుముందు మా అక్కయ్యకు మాటిచ్చారా మా ఇంటికి వస్తానని?"

"లేదు కానీ చంద్రంకోసం వచ్చేవాడిని వాడిక్కడలేదు. మీ అక్కయ్య చెప్పినదాట్లో కూడా కారణం ఉందని తెలిసి మీ ఇంటికి రావడం మానేసాను"

"ఓ! మీకు చాలా దూరదృష్టిఉంది సంతోషం ఇక ఎప్పుడూ మా ఇంటికి రాకండి" సత్యలేచింది.

"సత్యా!" చివాలున సత్యచేయి పట్టుకుని ఆపాడు శ్రీరాం. అతని స్పర్శ ఆమె ఎదలో ఝల్లు మనిపించింది కోటివీణలు మ్రోగినట్టనిపించింది. శ్రీరాం ఆమెను కూర్చోబెట్టాడు

"మీరు కోపంలో చాలా అందంగా ఉంటారు" కొంటెగా నవ్వుతున్న శ్రీరాం కేసి రుసరుసలాడుతూ చూసింది సత్య

"పొగడ్డం మాత్రం వచ్చు. ఏమంటే నా అభిప్రాయం వెల్లడి చేయకూడదా అంటారు మీతో మాట్లాడ్డం కష్టం."

"పోనీ మాట్లాడకండి. మీకేనష్టం. నేను నెక్స్టువీక్ వూరికెళ్తున్నాను. మీ యింటికి రావాలనే ఉన్నా మీరు గుడికి వెళ్ళడం చూసి మీతో మాట్లాడుదామని ఇలా వచ్చాను. వింటున్నారా?"

సత్య కళ్ళెత్తి చూసింది వింటున్నానన్నట్లుగా

"సత్యా మీకు నా మీద ఏ అభిప్రాయం ఉంది?"

సత్య ఉలిక్కిపడింది. సమయం ఆసన్నమయింది అనుకుంది. ఆమె గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి

"మిమ్మల్నే నా మీద మీ కెటువంటి అభిప్రాయం వుంది?" అంటూ రెట్టించాడు. సూటిగా అడగటానికి ఎందుకింత బిడియపడ్తాడు! అనుకుని పైకి తేలిగ్గా నవ్వేస్తూ "ఏం ఎవరయినా కాండక్ట్ సర్టిఫికెట్ అమ్మాయిదగ్గర తీసుకురమ్మన్నారా!" అంది

"నేను సీరియస్‌గా అడుగుతుంటే మీరు జోక్‌గా తీసుకుంటున్నారు" గంభీరంగా చెప్పాడు శ్రీరాం

"మా అన్నయ్య ఫ్రెండ్‌గా మీకు నేను చాలా గౌరవిస్తాను చాలా." అంది

శ్రీరాం మొహంమీద చిరునవ్వు కనిపించింది అంతలోనే సీరియస్ అయిపోయాడు రెండు చేతులు వెనక్కి ఆనించి జారగిలబడ్డాడు అతని కళ్ళు సూటిగా సత్యకేసి చూస్తున్నాయి

"సత్యా! ఇన్నాళ్ళూ ఈ సమయం దొరకలేదు. నేను చెప్పేది శ్రద్ధగా విను ఆలోచించు. నన్నపార్థం మటుకు చేసుకోకు. నిన్ను చూసినప్పటినుంచి నాలో



ఏదో మార్పు వచ్చింది. ఎన్నాళ్ళనుంచో నేను పోగొట్టుకున్న వ్యక్తి నీవనిపించింది నీకోసమే ఇన్నాళ్ళూ నిరీక్షిస్తున్నా ననిపించింది సత్యా ఐలైక్ యు వెరీమచ్ నీకేం అభ్యంతరం లేకుంటే మనం పెళ్ళి చేసుకుందాం.''

సత్య తలెత్తి మధురంగా నవ్వింది.

''అభ్యంతరం ఉంటే?''

''అబద్ధం. నే కోరిన జవాబు నీ కళ్ళల్లో మెరుస్తోంది మేడమ్'' అంటూ ప్రేమగా సత్యను చేతిలోకి తీసుకున్నాడు ఆమె దేహంలో విద్యుత్తు ప్రవహించి నట్టయింది

ఈ నాజూకైన పెయింట్ చూస్తుంటే నాకు తాకాలనిపించేది ''

''వూఁ!'' నవ్వింది సత్య.

ఒక్కసారి శ్రీరాం సత్యను దగ్గరగా లాక్కున్నాడు ''సత్యా ఈ క్షణంకోసం నే నెన్ని కలలుకన్నాను నీ సాన్నిధ్యంలో నా కేవి వద్దనిపించేవి. రోజూకోసారన్నా నిన్ను చూడకుండా ఉండలేక పోయే వాడిని మీ అక్క చెప్పినపుడు నేనెంత బాధపడ్డాను సత్యా నే నంటే నీకు ఇష్ట మేనా?''

''రాం! అలా అడగొద్దని చెప్పలేదు. ఈ మధుర క్షణంకోసం ఎంత తపించాను'' అతని షర్టుపైన సత్య ఆనంద బాష్పాలు పడి అతని హృదయంలోకి యింకి పోయాయి. ఎక్కడో అలికిడి అవడంతో సత్య దూరంగా జరిగి కూర్చుంది. పలుచటి చీకటితెర లోకాల్ని కమ్మేసింది.

''సత్యా. నేను నాలుగురోజుల్లో వూరెళ్తున్నాను ఎందుకో తెల్సా నిన్ను శాశ్వతంగా మా ఇంట్లో ఉంచుకునే

ప్రయత్నంకోసం. ఇంటికి వెళ్ళి అమ్మా వాళ్ళను వప్పించాలి. ఆ విషయంలో కొంచెం ఆలస్యం జరిగినా దిగులుపడకు నే వెళ్ళగానే నీకు ఉత్తరం వ్రాస్తాను "

"ఆలస్యం అవుతుందని ఎందుకను కుంటున్నారు?"

"నాకు పెళ్ళి కావలిసిన చెల్లెలుంది ముందా అమ్మాయి పెళ్ళి చేయాలి కదా! మేమా సామాన్య గృహస్థులం నాకు ప్రస్తుతం ఉద్యోగంలేదు ముందు నేను ప్రాక్టీస్ చేయాలి. తరవాతే మన పెళ్ళి వీటన్నిటికీ కొంతకాలం పడ్తుంది మీ యింట్లో నీకే ప్రయత్నాలు చేయకుండా మన సంగతి చెప్పు అదీ వీలుకాకుంటే నాకు వెంటనే లెటర్ రాయి" మౌనంగా తలూపింది సత్య

"చీకటిపడింది వెళ్ళాం పదండి" అంటూ సత్య లేవడంతో ఆమె చేతిని ఆసరాగా తీసుకుని శ్రీరాం లేచాడు

"సత్యాదేవీ! ఒక పొరపాటు జరిగింది ఆవేశంలో నిన్ను అని ఏకవచనంలో పిలిచాను. అభ్యంతరమా?"

"ఊ(!" అని చిలిపిగా నవ్వింది సత్య

"అరె సత్యభామాదేవిగారూ!"

"వద్దు. సత్య చాలు " ఇద్దరూ నవ్వు కున్నారు గుడి ఆవరణదాటి రోడ్డుమీదకు వచ్చారిద్దరూ

అక్కడ్నించి శ్రీరాం సత్యను ఇంటి వరకూ దిగబెట్టి వెళ్ళిపోయాడు. ఆ తరువాత మూడురోజులు ఆమెతో గడి పాడు ఆ మూడుదినాలలో సత్య శ్రీరాంకు అతి సన్నిహితంగా వచ్చింది. ఆరోజు సాయంత్రం ఇద్దరూ గుడికివెళ్ళి తిరిగి వస్తున్నారు. ఇద్దరూ విడిపోయేటప్పుడు సత్య కళ్ళల్లో పలుచటి నీటితెర శ్రీరాంకు కన్పించింది

"మీరు త్వరగా అన్నిపనులు పూర్తి చేసుకోండి ఎప్పటికప్పుడు నాకు లెటర్ రాయండి "

"తప్పకుండా. నిన్నువదిలి నేనెలా ఉండగలను సత్యా నీకో రహస్యం చెప్పనా?'

సత్య ఆశ్చర్యంగా చూసింది.

'నీకోసం మీ అన్నయ్యసాకుతో వచ్చేవాడిని కానీ నేనింత అదృష్టవం తుడినని తెలీదు."

ప్రేమ పూరితమైన అతనికన్నుల్లోకి చూసిన సత్య బుగ్గలు ఎర్రబడ్డాయి.

"సత్యా! ఇంకోమాట నేను వారం రోజుల్లో తిరిగి వచ్చేస్తాను వచ్చి మీ ఇంట్లో మనసంగతి చెప్తాను నీకై నీవు అడగద్దు ఏమంటావు?"

"అలాగే!" అంది సత్య "ఒకవేళ మీరు వారంలోపల రాలేకుంటే ?" అని ప్రశ్నించిన సత్య చేతిని తన చేతి లోకి తీసుకుని శ్రీరాం నవ్వాడు.

"వచ్చి తీరుతాను. రాలేకుంటే నా మీద నమ్మకం పోగొట్టుకోకు. నీవు లేకుండా నేను బ్రతుకలేను సత్యా. ఇది



నిజం యు ప్లీజ్ వెయిట్ ఫర్ మి'' ఆమె చేయినొక్కి దృఢంగా చెప్పి సత్య ఇల్లురాగానే అతను శెలవు తీసుకున్నాడు గుమ్మందగ్గరే నిలబడిపోయి శ్రీరాం వెళ్ళినవంక చూస్తున్న సత్య చెవిలో పదే పదే ''నీవు లేకుండా నేను బ్రతుక లేను సత్యా. యు ప్లీజ్ వెయిట్ ఫర్ మి'' అన్న వాక్యాలు విన్పిస్తున్నాయి ఆమె తన్మయత్వంలో ఇంట్లోకి వెళ్ళి పోయింది.

శ్రీరాం వెళ్ళి వారమవుతున్నా అతని దగ్గర్నించి ఉత్తరం రాలేదు ఏదో రోజు అతని దగ్గర్నించి ఉత్తరం వస్తుందని ఎదురుచూచిన సత్య నిరాశ చెందింది నెలరోజులు గడిచిపోయాయి దినమొక యుగంగా గడుపుతున్న సత్య వాళ్ళ నాన్నకు బదిలీ కావడంతో హడలి పోయింది. గోరుచుట్టుమీద రోకలి పోటులా అయింది ఆమెపని వాళ్ల వూరుమార్చి రెండు నెలలయినా శ్రీరాం దగ్గర్నించి ఉత్తరంకానీ, ఏ సమాచారం కానీ తెలీదు. శ్రీరాంకు ఏమయింది? ఎందుకని ఉత్తరం రాయలేదు? అనే ఆలోచన ఆమె మనసును పురుగులా తొలిచేసేది. ఏదో బలీయమైన కారణం వల్ల అతనివద్దనుండి ఉత్తరం రాలేదు అనుకుని మనసుని సమాధాన పరిచేది "అతని తల్లిదండ్రులు వివాహానికి సమ్మతించలేదేమో? అటు వాళ్ళ మనసు నొప్పించే ధైర్యంలేక తనకు ఉత్తరం వ్రాయలేదేమో'' అనుకున్నపుడు ఆమె మనసు జలదరించేది. సంవత్సరం గడి

చింది. ఆమెకేదో అర్థం అయినా దానిలో విర్లిప్తత అలవరుచుకుంది.

సత్య తల్లిదండ్రులు ఆమెకు పెండ్లి చేయదలచి ఎన్నో సంబంధాలు తెచ్చారు సత్య ఏదీ వప్పుకోలేదు. సంవత్సరం పాటు ఆమె ఆలోచనలు ఆమెనే బాధించేవి. మనోవ్యాధితో జబ్బుపడి మరో ఆర్నెల్లకు కానీ తేరుకోలేక పోయింది. తల్లి ఆమెలోని మార్పుకు కారణమేమని నిలదీసి అడిగినా సత్య జవాబు చెప్పలేదు ఎం. ఎ లో చేరతానంది. అష్టే బలవంతం పెట్టకుండా సత్య తల్లిదండ్రులు ఆమెను ఎం. ఎ లో చేర్పించారు. చదువు పూర్తికాగానే సత్య లెక్చరర్ ఉద్యోగంలో చేరింది.

*　　*

బాగా తెల్లవారిపోయినా బెడ్ మీద నుంచి లేవలేదు శ్రీరాం. ఇరవై ఏళ్ళ తర్వాత సత్యను తను చూసాడు వయసు ఆమెలో పెద్దగా మార్పు తేలేదు. ఆమెను తన జీవితంలో మళ్ళీ చూస్తా దనుకోలేదు. ఎక్కడున్నా ఆమె అయినా సుఖపడితే చాలు అనుకున్నాడు తను కోరినట్టే ఆమె సుఖంగా ఉన్నట్టుంది. శ్రీరాం మనసెందుకో కలుక్కుమంది. "మీ శ్రీమతితో మాఇంటికిరండి ' అన్న సత్యమాటలు అతని మనసులో మెదిలి శుష్కంగా నవ్వుకున్నాడు. "నా జీవితంలో నీకుతప్ప అంతటిస్థానం మరెవ్వరికీ లేదు సత్యా!" అనుకున్నాడు.

శ్రీరాం ఏదో గుర్తుకు వచ్చినవాడిలా లేచి బీరువాతెరిచి లాకర్‌తీసి లోపల్నించి ఏదో కవరుతీసి కిటికి దగ్గరనిలబడి చదువుతున్నాడు. పాతపడ్డ ఆ కవర్‌లోని కాగితాలను జాగ్రత్తగా పట్టుకున్నాడు. అది శ్రీరాం తన ఫ్రెండ్‌కు రాసిన ఉత్తరానికి సమాధానం.

"డియర్ రాం!

నీ లెటర్ అందింది. సారీ నీ చెల్లెలు పోయిందని రాసావు. నాకు చాలా బాధ వేసింది. చెల్లెలు పెళ్ళికి చాలా తొందర పడేవాడివి. కాని దేవుడు ఇలా చేసాగు కద!

నీవు చంద్రం వాళ్ళ ఫామిలీగురించి అడిగావు. వాళ్ల ట్రాన్స్‌ఫర్ అయిపోయారంట. ఏవూరో కనుక్కుని నీకు రాసేందుకు లేట్ అయిపోయింది. నా ఫ్రెండ్ ఒకడిద్వారా తెలుసుకున్నాను. వాడికి సత్య వాళ్ళు బాగాతెలుసు. ఆమెకు పెండ్లి అయిపోయిందని అత్తగారింటికి వెళ్ళిపోయిందని నాకు చెప్పాడు. ఎంత ప్రయత్నించినా నేను ఇంతకంటె ఎక్కువగా తెలుసుకోలేక పోయాను. సత్యకు ఇక్కడ్నించి ట్రాన్స్‌ఫర్ అయిపోయిన నెలకే పెళ్ళయిందని వాడు విన్నాడుట. ఇదీ సంగతి. త్వరగా లెటర్ వ్రాయి.

నీ ప్రియమిత్రుడు

రఘు"

ఆ ఉత్తరం అతనిలోని జ్ఞాపకాలను రేపింది. "శెలవులకు వూరెళ్ళాడుతను.



సత్య విషయం ఇంట్లో చెప్పాలని వాళ్ళ అనుమతిపొంది సత్యను పెళ్ళాడాలని కలలు కన్నాడు. పోగానే వూర్లో అప్పటికే బాగా వ్యాపించిన ఫ్లూ అతన్నికూడా పలుకరించింది. ఫ్లూ రావడంతో తను నెలరోజులవరకూ లేవలేకపోయాడు ఏదో తెలీని నీరసం ఆవరించి సత్యకు ఉత్తరం రాసే స్థితిలోకూడా లేడుతను ఇంతలో తనచెల్లెలు వేణికి సంబంధాలు రావడం, వాటి బాగోగులు విచారించడంతో మరోవారం గడచిపోయింది. ఇంతలో తను కొంచెం తేరుకున్నాడు ఆ వెంటనే సత్యకు ఉత్తరం వ్రాసాడు. దానికి జవాబురాలేదు ఇంతలో వేణికి ఒక సంబంధం సెటిల్‌కాగానే సత్య సంగతి ఇంట్లోతెల్పి వాళ్ళ ఆమోదం పొందాడు. ఆ శుభవార్త వెంటనే సత్యకు రాసి తన అడ్రసుకూడా రాసాడు రిప్లై ఇవ్వమని దానికి రిప్లైలేదు. వెంటనే తను వూరికి పోవడానికన్నీ సర్దుకున్నాడు అంతకుముందు మూడు రోజుల్నించీ కడుపునొప్పితో బాధపడ్తూ మందు తీసుకుంటున్న వేణి తన చిన్నారి చెల్లెలు. తనంటె అత్యంత అభిమానంచూపి ఒక్కగానొక్క చెల్లెలు ఆరాత్రి ఎవరూ వూహించనట్లు చనిపోయింది ఒక్కసారి అతివేగంగా దూకే జలపాతం ఆగినట్లు స్థంభించి పోయారు ఇంట్లో వాళ్ళంతా. తను ఆ సంఘటనతో పిచ్చివాడయ్యాడు. తిరిగి ఎన్నాళ్ళకి మామూలు మనిషయ్యాడో తనకే తెలీదు. ఆవెంటనే సత్యకోసం వూరెళ్ళి వాళ్ళు ట్రాన్స్‌ఫర్ అయిపోయారని ఊరువదలి మూడ్నెల్లైయిందని తెలుసుకుని నిరాశతో వెనక్కి వచ్చి తన స్నేహితుడు, చంద్రం వాళ్ళ ఫామిలీతో పరిచయంఉన్న రఘుకు సత్య వాళ్ళు ఎక్కడికి వెళ్ళిందీ, వాళ్ళగురించి రాయమని ఉత్తరం రాసాడు దానికి జవాబుగా ఈ ఉత్తరం పంపాడు. ఇదిచూచి

తనలా దిలించిపోయాడు. సత్య తనను ఇలా మోసం చేస్తుందనుకోలేదని కొన్నాళ్ళు ఫీలయాడు. కానీ ఆలోచించగా ఆలోచించగా ఆమె తప్పేమీ లేదని పించింది. వెళ్లగానే ఉత్తరం రాస్తానన్న మనిషి నెలవరకూ రాయకపోయేసరికి అనుమానపడి ఉంటుంది. ఈ లోపల వాళ్లు ట్రాన్స్ఫర్ అవడంతో తను వ్రాసిన ఉత్తరాలు వాళ్లకి అందలేదు. అందుకే సత్య తనను మరచిపోయి ఇంకొకర్ని చేసుకుంది. ఇక సత్య తన కేమీ కాదు అనుకున్నాడు. గుండె రాయి చేసుకున్నాడు. కాని సత్యను తనెందుకు మరువలేకున్నాడు? ఇది జవాబుదొరకని ప్రశ్న. తను జీవితంలో సత్యమ మన సారా కోరుకున్నాడు. మరెవర్నీ తన జీవితంలోకి ఆహ్వానించలేదు. నిత్యం మనసులో సజీవంగా మెదిలే సత్య ఎక్కడున్నా కట్టేసి దగ్గరికి తెచ్చుకుందా మనే కోరిక ప్రగాఢంగా కలిగేది ఒక్కో సారి. కావి బలవంతంగా ఆకోరికనణి చేసుకున్నాడు. అప్పట్నించీ మోడులా బ్రతకడం నేర్చుకున్నాడు. ఇంట్లో అక్కయ్యవాళ్లు పెళ్ళిచేసుకోమంటూ ఎంతపోరినా పట్టినట్టు ఉండి పోయేవాడు.

"అంకుల్" శ్రీరాం ఆలోచనలు ఆగి పోయాయి. వెనక్కి తిరిగిన శ్రీరాంకు అరటిపండు తింటూన్న రఘు కన్పిం చాడు.

"అంకుల్! అమ్మ పిలుస్తూంది. కాఫీకి రావాలంట" అని చెప్పేసి వెళ్లి పోయాడు. శ్రీరాం దీర్ఘంగా నిట్టూర్చి ఉత్తరం భద్రంగా యధాస్థానంలో పెట్టేసి క్రిందకు వెళ్ళాడు.

* *

రోజులు చకచకా గడిచిపోతున్నాయి. శ్రీరాం మనసులో సత్యాదేవిని చూసి నప్పటినుంచి ఆమెను మరోసారికలిసి మాట్లాడాలనే కాంక్ష రోజు రోజుకూ ఎక్కువవుతోంది. సందర్భం, సమయం కలసిరాక, సత్య వాళ్ళింటికి తనకై తను వెళ్ళేధైర్యం లేక వూరుకుండి పోయాడు.

రఘు పుట్టినరోజు చాలా గ్రాండ్గా చేయాలని వాళ్ళమ్మ తులసి నిశ్చయిం చింది. భర్తపై చదువులకోసం ఫారిన్లో ఉన్నాడు రఘు పుట్టినరోజుకు అందరితో పాటు సత్యాదేవికి ఇన్విటేషన్ పంపాడు. పార్టీ ఎంత గ్రాండ్గా గడచినా శ్రీరాంకు తృప్తి కలగలేదు. సత్యాదేవి పార్టీకి రాలేదు.

మరునటిరోజు కోర్టునుంచి ఆలస్య ముగా వచ్చిన శ్రీరాంకు లోపల్నించి చిరపరిచితమైన నవ్వు విన్పించింది. తులసి కారుచప్పుడు వినికాబోలు లోప ల్నించి వచ్చింది. శ్రీరాం సోఫాలో కూర్చోగానే కాఫీ తెచ్చిఇచ్చింది.

"నీకోసం సత్యాదేవి వచ్చింది" అంది. శ్రీరాం ఉలిక్కిపడిలేచి "ఏది?" అనడిగాడు.

"పైన పీగదిలో కూర్చోబెట్టాను"

అంది లోపలకెళ్తూ. శ్రీరాం కాఫీకప్పు వదిలేసి పైకి వెళ్ళాడు తెల్లటిచీర, అదే రంగు జాకెట్టు చక్కటిముడి అందులో మల్లెలమాల పెట్టుకుని కూర్చున్న సత్యా దేవి అలికిడికి వెనుదిరిగి చూసిలేచింది. ఆమెకళ్ళు చాలా తేజోవంతంగా మెరుస్తు న్నాయి

"అరె! నిలబడ్డారేం. కూర్చోండి చాలా థాంక్స్ మరచిపోకుండా వచ్చారు నిన్న రాలేదేం" శ్రీరాం అడిగాడు!

"మిమ్మల్ని మరచినరోజా నాకు నేనే గుర్తుండను" అనుకుందామె మనసులో పైకి నవ్వింది

"ఎవరూ రాలేదేం నిన్న మీ వారు. మీరు కనీసం మీ అబ్బాయన్నా రాలేదు?" అనడిగాడు ఆమెకెదురుగా కూర్చుంటూ.

"వాళ్లెవరూ ఇంట్లోలేరు" ఆమె కళ్లెత్తి అతనికళ్ళల్లోకి సూటిగా చూపింది. ఆమె పెదవులు చిన్నగా కంపిస్తున్నాయి మొహం కాంతివంతంగా వెలుగుతోంది

"ఏమిటలా చూస్తున్నారు?"

ఆమె నవ్వింది మునుపటి అందం ఏమాత్రం తగ్గలేదు ఆనవ్వులో

"మీ భార్యను చూపించి పరిచయం చేయలేదేం?" కొంటెతనం ఆమె కళ్ళల్లో చూపిన శ్రీరాం దాన్ని ఎగతాళిగా అర్థం చేసుకున్నాడు.

శ్రీరాం నిర్జీవంగా నవ్వాడు. "నాభార్య గురించి తెల్పేముందు మీకోకథ చెప్తా వినండి. ఒకవూర్లో ఒక దౌర్భాగ్యుడుండే వాడు వాడోమంచి అమ్మాయిని ప్రేమిం చాడు. తన ఆశలసౌధాలన్నిటిని ఆమె నాధారంచేసుకుని కట్టాడు. ఆమెకు తన ప్రేమ తెలియపరిచి ఆమె అభిమానం పొందాడు కథల్లో చదివినా, సినిమాలో చూసినా ప్రేమఅంటే పిచ్చి అనుకున్న వాడు అది అనుభవంలోకి వచ్చేసరికి అది ఎంత మహోన్నతమైనదో అర్థం చేసుకున్నాడు ఆ అమ్మాయికి తన ప్రేమనంతా వెళ్ళబోసుకుని ఒకవిధంగా ప్రేమ భిక్షను యాచించాడు. ఆ అమ్మాయి ఏమనుకుందో వప్పుకుంది కానీ అతన్ని నమ్మలేకపోయింది సుందరస్వప్నాలను చూపించినట్టే చూపించి తనదారి తాను వెళ్ళిపోయింది. అతన్ని నిరాదరణ చేసి మరో ఉన్నతుడిని పెళ్ళిచేసుకుని వెళ్ళి పోతే అతనెలా కుమిలిపోతాడో ఆమె వూహించి ఉండదు ఒక్కగానొక్క చెల్లెలు మరణంతో మానసికంగా కుమిలి క్రుంగిపోయిన అతడు ఆమె నిష్క్రమణతో పిచ్చివాడయ్యాడు. ఆశోహతు డయిన అతడు తనజీవితంలో మరొకర్ని వూహించుకోలేక ఆమెనే జపిస్తూ ఉండి పోయాడు. జీవితంలో తటస్థపడదని అనుకున్న ఆమె మరోసారి కనపడినా అన్నీ మరచినట్టే నటించింది ఎందుకో తెలుసా? వచ్చాని తన సంసారంలో నిప్పులు పోస్తాడేమో అనుకుంది కానీ ఆమెకోసం ఏక్షణంలో అయినా ప్రాణం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడని ఆమెకు

తెలీదు. ఇదీ అతనిబాధ." శ్రీరాం మనసులోని బరువంతా దింపుకున్నట్టు వూపిరి పీల్చాడు. ఇంతలో వెక్కి వెక్కి ఏడుస్తున్న ధ్వనివిని సడన్‌గా వెనుదిరిగి చూసాడు.

సత్యాదేవి మోకాలుమీద తలవంచుకుని ఏడుస్తోంది. ఆమె మనసంతా కలచినంత బాధగా ఏడుస్తోంది. భగవాన్! నాకెందుకు మరణం ప్రసాదించవు? ఇతనికోసం కాదూ తను ఇన్నాళ్ళూ బ్రతికింది. ఎక్కడిదీ ప్రేమబంధం. అది ఎందుకు తన్నిలా కట్టిపడేసింది? ఇతనిలో తన పట్ల ఇంత ప్రేమ నిక్షిప్తమయిందా? ఆనందం దుఃఖ పెనవేసుకుని భాష్పాలు రాలుస్తున్నాయి ఎందుకీ ఉద్వేగం? భారమైన మనసుకరిగి ప్రవహిస్తోంది తనింత అపార్థం చేసుకుంది కాని తన నిరీక్షణ ఎన్నాళ్ళకు ఫలించింది.

శ్రీరాం ఆమెను ఏడవవద్దనలేదు ఐదు నిముషాలనంతరం ఆమె దుఃఖం ఆగి పోయింది. కళ్ళు తుడుచుకుంది. వర్షించిన మేఘాలంత నిర్మలంగా ఉన్నాయి. ఆమె కనులు.

"క్షమించండి పెళ్ళయిపోయి ఎన్నేళ్ళకో కలుసుకున్న మిమ్మల్ని బాధ పెట్టాను."

"రాం!" ఆమె బాధగా కోపంగా పిలిచినా అతని గుండె చలించింది ఆ పిలుపుకు.

"ఆ మాట అనకండి. ఆమెకు అన్ని విషయాలు తెలియకపోయినా అతని పట్ల ఆమె అభిప్రాయం ఏనాటికీ మారదు." ఆమె నిశ్చలంగా చెప్పింది

శ్రీరాం ఏదో గుర్తుకొచ్చిన వాడిలా లేచి తాను కొన్న పెయింటింగ్ ఇచ్చాడు.

"ఇది మీ మారేజి ప్రెజెంటేషన్ ప్లీజ్ కాదనకండి"

సత్య నవ్వింది. దాన్నిచూసి టేబుల్ మీద పెట్టి "మీదగ్గరే ఉంచండి" అంది.

"నాలాగే అదీ చేదయిందా?" శ్రీరాం చిన్నబోయిన మొహంతో అడిగాడు. సత్యాదేవి రెప్పవాల్చకుండా అతనికేసి చూసి కళ్ళుదించుకుంది "మీరు చేదని నే నేనాడూ అనలేదే? అయినా ఇదేమిటి ఇంటికి పిల్చిపోట్లాట వేసుకున్నారే?"

"సత్యా! నాలో ఆవేదన ఎవరికి చెప్పుకోను ఈ గుండెలు నిత్యం ఎలా రగులుతాయో నీకర్థంకాదు. నామనసులో నిలిచిపోయిన నీవు నీచుట్టూ ఆకర్షణ అనే భయంకరజ్వాలలు నన్ను దహించి వేస్తుంటాయి. నీవు నన్ను మోసగాడి వనుకున్నావేమోనని ఒకవైపు, నామీద నమ్మకం ఉంచకపోయావే అని మరో వైపు ఆలోచనలు పీడించి పిప్పిచేస్తు న్నాయి. వక్కసారయినా నన్ను గుర్తు తెచ్చుకున్నావా సత్యా. నన్ను క్షమించు. ఈ కాసేపు నిన్ను అనే సంబోధించి నందుకు."

సత్య శూన్యంలోకి చూస్తూ నిల బడింది. ఆమె మెదడులో ఆలోచనలు



వలయాలుగా తిరుగుతున్నాయి. "రాం! నిన్ను మర్చిపోలేకదా గుర్తు తెచ్చుకునేందుకు! ఆరోజు నీ ఉత్తరంకోసం ఎదురు చూసిన కళ్ళు నేటివరకూ నీకొరకు ఎదురుచూస్తూనే ఉన్నాయి కోటి కోర్కెలతో మనసు నింపుకున్నాను ఒంటరిగా నేనెలా కుళ్ళి ఏడ్చానో నీకెలా అర్థం అవుతుంది? రాం. చాలు. ఇకనన్ను మాటలతో చిత్రవధచేయకు. ప్లీజ్ ఇది నేను భరించలేను." సత్యాదేవి నిలబడలేని దానిలా చప్పున శ్రీరాం హృదయం పైన వాలిపోయింది. ఆమెకు తెలీయకుండానే కన్నీరు అతని షర్టును తడిపేస్తోంది. శ్రీరాం నిర్ఘాంతపోయినా ఆమెను దూరం చేయలేకపోయాడు. రెండు నిముషాలు గడిచిపోయాయి హఠాత్తుగా సత్యాదేవి శ్రీరాం కౌగిలి నుంచి జారిపోయి విపరీతమైన బాధతో మెలితిరగసాగింది.

"సత్యా! ఏమయింది?" కంగారుగా శ్రీరాం ఆమెను మంచంమీదికి చేర్చాడు. ఆమె కనుకొలుకుల్లోంచి కన్నీళ్లు కారుతున్నాయి మాట్లాడకుండా బాధపడ్తోంది. బలవంతాన కళ్ళు తెరిచి చెప్పింది "నాకు గుండెనొప్పి వస్తుంది. నన్ను ఇంటికి చేర్చండి" అంది ఆయాస పడ్తూ.

శ్రీరాం క్రిందకు వేగంగా పోయి ఫోన్ చేసాడు డాక్టరుకు తులసిని తీసుకుని పైకి వచ్చాడు. సత్య వాళ్ళింటికి కూడా ఫోన్‌చేసి వాళ్ళను రమ్మని చెప్పాడు.

ఇంతలో డాక్టర్‌వచ్చి పరీక్ష అదీ చేశాక ఆమెను కదలనీయకూడ

దని వారంరోజులు రెస్ట్ తీసుకోవాలని చెప్పి వెళ్ళాడు. కాసేపటికి ఇరవై రెండేళ్ళ వ్యక్తి వచ్చాడు.

"మీరు " అంటూ ఆగిపోయాడు శ్రీరాం సందిగ్ధంగా.

"సత్యాదేవిగారికోసం వచ్చానండి."

"ఓ! మీ మదర్ పైన ఉన్నారు పదండి" అన్నాడు శ్రీరాం

"నో. నో! ఆవిడ మా మదర్ కాదు. మా పిన్ని" అన్నాడా వ్యక్తి

"సారీ! నేను సత్యాదేవి కొడుకు మీరే అనుకున్నాను "

ఆ వ్యక్తి చిన్నగానవ్వి "మా పిన్నికి పెళ్ళికాలేదు" అంటూ చెప్పి ఆతుతరతతో పైకి వెళ్ళిపోయాడు

శ్రీరాం పిడుగుపాటు తిన్నవాడిలా నిలబడిపోయాడు. ఆమె ఎందుకు పెళ్ళి చేసుకోలేదు. తనకోసం వేచివుందా? శ్రీరాం మనసు దూదిపింజంలా తేలికయింది. క్షణంలో అతనికంతా అర్థం అయింది. త్వరత్వరగా పైకి వెళ్ళిన శ్రీరాంకు కళ్ళుమూసుకుని పడుకున్న సత్య కన్పించింది. సత్యాదేవి అక్క కొడుకు వంగి ఆమెతో ఏదో మాట్లాడుతున్నాడు. శ్రీరాం బయట నిలబడి పోయాడు. కాసేపట్లో ఆ అబ్బాయి బయటికి వచ్చాడు.

"మా పిన్నిని ఇంటికి తీసుకుపోతున్నాను డాక్టర్‌గారు వారందాకా కదలనివ్వకూడదన్నారని తెలిపి అంబులెన్స్‌పై వాళ్ళను తీసుకువచ్చాను పిన్నిని ఇంటికి తీసుకుపోతాను" అన్నాడు శ్రీరాంతో.

"వద్దు మరేం పరవాలేదు. మీ చిన మామయ్య చంద్రం నేను క్లోజ్ ఫ్రెండ్స్‌ము సత్యాదేవి నాకు బాగా తెలుసు. మీ కభ్యంతరం లేకుంటే ఇక్కడే ఉండనివ్వండి వారంవరకూ ఆ తరువాత తీసుకెళ్ళవచ్చు."

"సారీ! మా పిన్ని ఇంటికి వెళ్దామంటోంది" శ్రీరాం దిగాలుపడ్డట్టు చూసి మరే విధమైన వత్తిడి చేయలేక "సరే! మీ ఇష్టం" అన్నాడు

* * *

వారం రోజులు గిర్రున తిరిగి పోయాయి. శ్రీరాం మనసు మునుపటి కంటె తేలిగ్గా ఉంది అతనికి మధ్య కేసులు ఎక్కువయి బొత్తిగా తీరికలేకుండా పోయింది ఎప్పటికప్పుడు సత్యాదేవి ఇంటికి పోవాలనుకునేవాడు మూడు రోజుల క్రితం సత్యాదేవి ఇంటికి ఫోన్ చేసి అమె ఒంట్లో బాగానే ఉందని తెలుసుకున్నాడు

ఆరాత్రి శ్రీరాం రెండు దినాలక్రితం నాటి పోస్ట్ చూసుకుంటున్నాడు సీలిరంగు కవర్ కనబడగానే దాన్ని ఆశ్చర్యంగా దాన్ని విప్పాడు అది రాసి రెండు మూడు రోజు లయుంటుంది. గులాబీరంగు కాగితంమీద నల్లటిముత్యాల్లాంటి అక్షరాలతో చివర "సత్య" అని ఉండడం చూసి చకచకా చదవసాగాడు

"ప్రియమైన శ్రీరాంగారికి.

సత్య ఇలా మీకు ఉత్తరంరాస్తుందని మీ రూహించకపోవచ్చు. కానీ మీకు దురభిప్రాయం పొగొట్టేందు కింతకంటె మార్గంలేదు. మీరు చెప్పిన కథలో హీరోయిన్ పాత్రపోషణ సరిగ్గాలేదు. ఆమెను క్రూరంగా చిత్రించారు. నిజజీవితంలో ఆ పాత్రను పోషిస్తున్న నేనంత దుర్మార్గురాల్ని కాను. మీరానాడు నన్ను ఇంటి దగ్గర దిగబెడ్తూ చెప్పినమాటలు నా హృదయంలో పటిష్టంగా నిలచిపోయాయి. మీకోసమే నిరీక్షిస్తూండిపోయాను. ఎక్కడికిపోయినా ఏ వ్యక్తిని చూసినా మీరే కన్పిస్తారేమో అని వెదుకుతాను. ఇలా కొన్నాళ్ళు మీకోసం పిచ్చిదాన్నయ్యాను. మాకు ట్రాన్స్ఫర్ అయ్యాక ఇంట్లో నాకు పెళ్ళిసంబంధాలు చూడ్డం ఆరంభించారు. నా మనసులో మీకై ఒకటే తపన. ఇంట్లో ఏమని చెప్పను ప్రేమించానంటే వూరుకుండిపోతారా? మీ దగ్గర్నుంచి ఒక్క ఉత్తరం కూడా రాకుండా దినాలు గడిచిపోతుంటే నా మనసెలా నలిగిపోయిందో మీకెలా చెప్పను? ఒక్కసారి మా ఇంట్లో వాళ్ళు బలవంతంగా పెళ్ళి చేస్తారేమో అన్పించేది. చదువుసాకుతో ముప్పైఏళ్ళు పెళ్ళి చేసుకోకుండా గడిపేసాను. ఆ తరవాత పెళ్ళిచేసుకోమని ఇంట్లో వత్తిడి ఎక్కువయింది. భగవంతుడా! నేనేం చేయను? ఇన్నేళ్ళూ నేనతన్ని ఆరాధించడం అబద్ధం అనుకుని వేరే వ్యక్తిని నాజీవితంలోకి ఆహ్వానించనా? అక్కయ్య నన్నెన్నో మాటలంది పెళ్ళి చేసుకోనందుకు. ఎవరికీ ఏ జవాబు చెప్పలేకపోయాను. మీరేదయినా బలవత్తర పరిస్థితుల్లో చిక్కుకుపోయారేమో అన్పించే దొకోసారి. మీకు ఉత్తరం రాయడానికయినా మీ అడ్రసు నాదగ్గర లేకపోయింది.

కష్టాలు పెట్టే భగవంతుడే అప్పుడప్పుడూ కొన్ని మంచిపనులు చేస్తుంటాడు. ముప్పై ఏళ్ళకు నాకు గుండెనొప్పి వచ్చింది. అది మొదలూ తరచూ ఆవేశం, ఉద్రేకం, మితిమీరిన ఆనందం కలిగితే నొప్పి వచ్చేది. ఈ సాకు నాకు చాలా వుపయోగపడింది. ఎవరైనా పెళ్ళిచేసుకోలేదేమంటే ఇదే సాకు చెప్పేదాన్ని. "మీవార్ని తీసుకుని మా గృహం పావనం చేయండి" అని చెప్పి వెళ్ళారు మీరు. నాకు ఎవరూ లేరు! కాదు.... అందరూ ఉన్నా నేను వంటరినే. ఎందుకో తెలుసా? మీరు నన్ను ఒక కోరిక కోరారు. గుర్తుందా! "యూ వెయిట్ ఫర్ మి" అన్నారు. అందుకే మీకోసం నేను నా ముప్పైఐదేళ్ళ వరకూ నిరీక్షించాను. ఆ తరువాత మీకోసం నిరీక్షించలేదు. మీ కాపాటికి పెళ్ళయిందని, పిల్లలతో కళకళలాడుతుంటారని వూహించుకునేదాన్ని. ముందలా అనుకున్నందుకు బాధ అన్పించినా క్రమంగా

అది అలవాటయిపోయింది. నాకేదయినా కోరిక వుంటే అది నేను మరణించేలోగా మిమ్మల్నొకసారి చూడాలని వుండేది.

మీ ఇంటికి నేను ఎందుకు వచ్చానో మీకు తెలీదు. మీ ఫామిలీని చూద్దామని వచ్చిన నేను జరిగినదంతా మీ అక్కయ్య ద్వారా విని విభ్రాంతపోయాను. మీ రెండుకు పెళ్ళి చేసుకోలేదో విన్నాక (మీ కథ ద్వారా) నా బలహీనపు గుండెలు సంభ్రమాశ్చర్యాలతో స్పందించాయి మాటలతో వర్ణించలేని సంచలనం నాలో కలిగింది. దాని ఫలితమే మళ్ళీ గుండె నొప్పి వచ్చింది.

రాం! మీ కోసం నేనెలా ఫీలయ్యానో అలాగే మీరు ఫీలవడం నా కళ్ళారా చూశాక నా కెంత తృప్తి కలిగిందని. మనది నిజాయితీ అయిన ప్రేమ కదూ! ఒకేమాట కిద్దరం కట్టుపడ్డాం. ఒకరినొకరు అభిమానిస్తూనే అనుమానపడ్డాం. ఈర్ష్య పడ్డాం. ఈవాళ నా మనసెంత తేలిగ్గా ఉంది. మీ కౌగిలిలోనే నా ప్రాణాలు పోయుంటే బాగుండుననుకున్నాను అంత అదృష్టవంతురాల్ని కాలేకపోయాను. రాం. మిమ్మల్నొక్కసారి చూడాలనుంది రాగలరా? మీ కేనాడూ మనస్సులో సంతోషం కలిగించలేకపోయాను ఇప్పుడు మీ వళ్ళో తల పెట్టుకుని నిదురించాలని ఉంది. ఈ నిరీక్షణలో ఇంత ఆనందం ఉందని నాకు తెలీలేదు ఇన్నాళ్లూ. మీరు వస్తారు కదూ!

మీ రాకకోసం నిరీక్షిస్తూ
మీ
సత్య"

"సత్యా!" శ్రీరాం పెదవులు పదేపదే ఆ పదాన్ని ఉచ్చరించాయి. చటుక్కున లేచి బట్టలు మార్చుకున్నాడు. క్రిందకు దిగి వచ్చాడు. లోపల్నించి తులసి పాల గ్లాసుతో వచ్చింది.

"ఇప్పుడెక్కడికి బయల్దేరావు. రెస్ట్ తీసుకో రాం!" అంది.

శ్రీరాం చిన్నగా నవ్వి "అక్కయ్యా! నే నెక్కడికి పోతున్నానో తెలుసా? నీ మరదలును తీసుకురావడానికి."

తులసి తెల్లబోయి చూసింది "మరదలా?"

"అదేనక్కా. సత్యను తీసుకురావడానికి కాదు చూడ్డానికి" శ్రీరాం పాలు తాగేసి గ్లాసు క్రింద పెట్టేసి "వస్తానక్కా!" మనస్ఫూర్తిగా నవ్వేసి వెళ్ళిపోయాడు చాలా రోజుల తరవాత తమ్ముని మొహంలో విరిసిన కళను చూస్తూ నిలిచిపోయింది తులసి.

శ్రీరాం కారు సత్యాదేవి యింటిముందాగింది శ్రీరాం హృదయంలో ఆనందం పురివిప్పిన నెమలిలా నృత్యం చేస్తోంది. కారు దిగిన శ్రీరాం దగ్గరికి మాలి పరుగెత్తుకుంటూ వచ్చి "ఇంట్లో ఎవరూ లేరు బాబూ! పెద్దమ్మగారు ఆస్పత్రిలో ఉన్నారు. ఆమెను చూడ్డానికి పోయారు" అన్నాడు.

"పెద్దమ్మగారికేమయింది? ఆస్పత్రిలో

ఎందుకుంది?'' గాభరాగా అడిగాడు శ్రీరాం మనసేదో కీడు శంకిస్తుండగా.

''గుండెనొప్పి బాబూ! రాత్రే చేర్చి నారు అమ్మగారు సానా మంచిమనిషి'' అంటూ కళ్ళొత్తుకున్నాడు వాడు.

శ్రీరాం తడబడే అడుగులతో కారె క్కాడు. రెండు నిమిషాల్లో కారు హాస్పిటల్ చేరుకుంది. శ్రీరాం దిగి లోపలికి పోతుండగా ఇంతలో అతన్నిరాచుకుంటూ ఆత్రంగా ఒక లావాటి మనిషిపోతూ వెనక్కి తిరిగి 'సారీ!'' అంటూ చటుక్కున నిలబడి, ''రాం! అన్నాడు సుపరిచితమైన కంఠస్వరం. ''చంద్ర'' అంటూ ఒక్కసారి ఆలింగనం చేసుకున్నాడు శ్రీరాం. ''నీ విక్కడ వున్నావా? సరే! అవన్నీ తరవాత, నడు. నీకు నా చెల్లెలు సత్య గుర్తుందా. దానికి హార్ట్ ఎటాక్ వచ్చి రాత్రి సీరియస్ అయి యిక్కడ చేర్చి నాకు టెలిగ్రాం యిచ్చారు. ముందే మా మదర్ వచ్చేసింది దాని కండిషన్ ఏం బాగలేదురా'' చంద్రం కళ్ళు దుఃఖ వేతకాటోలు ఎర్రబడ్డాయి.

''పద. సత్యను చూద్దాం'' శ్రీరాం గొంతులోని వణుకు, ఆవేదన చంద్రం గుర్తించలేదు సత్య స్పృహలో లేదు. అంతా హడావిడిగా ఏమేమో మాట్లాడు కుంటున్నారు. సత్య అమ్మ మూలగా కూర్చుని ఏడుస్తోంది. చంద్రం సత్య మంచంమీద కూర్చుని తల నిమురుతూ కన్నీరు కారుస్తున్నాడు. అందరూ పైకి ఏడుస్తుంటే శ్రీరాం దూరంగా తలుపు దగ్గర నిలబడి మనసులో ఏడుస్తున్నాడు. అతని మనసు చిన్నాభిన్నమయిపోతోంది. ''సత్యా! ఒక్కసారి కళ్ళుతెరు. నీకోసం. నీ కోరిక తీర్చడంకోసం నే వచ్చా సత్యా నిన్ను నా దానిగా చేసుకుందామని ఎంతో ఆశతోవచ్చా సత్యా కాని ఐయామ్ టూ లేట్! నా కళ్ళముందే నీవు నన్ను దూరంచేసి పోతావా? ఇంతమందిలో నీ తల ఒళ్ళో పెట్టుకునే అధికారం నాకు లేదు. నే నెంత దురదృష్టవంతుడిని! అతని కళ్ళు వర్షించసాగాయి కళ్ళనుండి వెచ్చని కన్నీరు కారిపోతోంటే ఆమె కెదురుగా స్థంభంలా నిలబడ్డాడు. అతని మనోవేదన గుర్తించిందా అన్నట్టు మరో నిముషానికి సత్య కళ్ళు తెరిచింది. ఆమె కన్నీళ్ళు నిండిన చూపులు ఎవరికోసమో వెదకి శ్రీరాంను చూడగానే జలజలా రాలి పోయాయి ఆమె కళ్ళు కొడికట్టే దీపంలా దేదీప్యమానంగా వెలిగాయి. ఇద్దరి చూపులు క్షణం కలుసుకున్నాయి ఆక్షణం విలువ కట్టలేనిది! చిరునవ్వు ఆమె పెదాలపై నిలిచింది. సంతృప్తిగా కన్ను మూసింది! ఒక్కసారి ఆ గదిలో ఏడ్పులు మింటినంటాయి.

శ్రీరాం అక్కడ ఉండలేక బయటికి వచ్చాడు. సత్యను కడసారిగా చూడగలి గాడు. చాలు! కన్నీరు తుడుచుకుని పైకి చూశాడు. ఆకాశంలో ఒక తార క్రొత్త కాంతులతో తళుక్కుమంటోంది. దాన్ని చూస్తూ అనుకున్నాడు. ''సత్యా! వెయిట్ ఫర్ మీ!!''